క్లుప్తంగా

లలిత త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి



కామేశ్వరుని వాహనంపై అమ్మవారు

విద్యానగర్: కరీంనగర్ మండలంలోని నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయంలో దుర్గాదేవి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు గురువారం అమ్మవారు లలిత త్రిపుర సుందరి అలంకరణలో కామేశ్వరుని వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి, పూజలు నిర్వహించారు. చండీహోమం, కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు దుర్గాదేవిని దర్శించుకొని, ఒడి బియ్యం సమర్పించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి శివాలయంలో చండీహవనం



పూజల్లో మున్సిపల్ చైర్మన్ రాజు, హరిహరణ్

కొత్తపల్లి: శ్రీదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు గురువారం కొత్తపల్లిలోని శివాలయం(శ్రీసీతారామచంద్ర అభయాంజనేయ సహిత సాయిబాబా దేవాలయం)లో స్కందమాత రుద్ర సహిత చండీహవనం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మంత్రి కమలాకర్ తనయుడు గంగుల హరిహరణ్, కౌన్సిలర్ గున్నాల విజయ, భవానీ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు. లింగదర్శనం, మహాదుర్గాదేవి దర్శనం అనంతరం వారికి ఆలయ ప్రధానార్చకుడు వాసాలమర్రి నాగరాజు శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కరీంనగర్ కల్చరల్: లైఫ్‌లైన్ హాస్పిటల్ చైర్మన్, వృద్ధాశ్రమ అధ్యక్షుడు చిట్టుమల్ల కొండయ్య ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ శ్రీకాంత్‌చే వాసవి వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ ప్రధాన కార్యదర్శి సామ నారాయణ, కోశాధికారి గుడిసె రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకుల బైండోవర్

కరీంనగర్‌రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని 22 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులను గురువారం తహసీల్దార్ నవీన్ ఎదుట బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఏఐసీసీ రీసెర్చ్ వింగ్ నేషనల్ కో–ఆర్డినేటర్‌గా రాజేశ్



రాజేశ్

కరీంనగర్‌రూరల్: ఏఐసీసీ రీసెర్చ్ వింగ్ జాతీయ కో–ఆర్డినేటర్‌గా కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన కాశిపాక రాజేశ్‌ను నియమిస్తూ వింగ్ చైర్మన్ ఎంపీ రాజీవ్ గౌడ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో పలు పదవులను సమర్థంగా నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి, కో–ఆర్డినేటర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. తనకు సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, మాజీ ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'అభివృద్ధిని చూసి.. ఆశీర్వదించండి'

చొప్పదండి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. గుమ్లాపూర్, కాట్నపల్లి, రుక్మాపూర్ తదితర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తదితరులున్నారు.

దాండియా ఆటలు ఆడ..

- నవరాత్రోత్సవాల్లో దాండియా సందడి
- ఆడిపాడుతున్న యువతీ యువకులు, మహిళలు
- వ్యాయామంతోపాటు మానసిక ప్రశాంతత

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్: అమ్మవారి కోవెల... ఆధ్యాత్మిక వాతావరణం.. భవానీ నామస్మరణ మధ్య... చల్లని రాత్రి.. విద్యుత్ వెలుగుల మధ్య ఆడిపాడే దాండియా.. మనసుకు ఆనందాన్నిస్తుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవిని పూజిస్తూ దాండియా నృత్యాలు చేయడం గుజరాతీ, రాజస్థానీల ఆచారం. దేవిని కీర్తిస్తూ.. రేపల్లెలో చిన్నికృష్ణుని లీలలు, యశోదసుతునితో అనుబంధాన్ని పాటల్లో విశదీకరిస్తూ లయబద్ధంగా కాలు కదుపుతూ, చేతిలోని కోలలను సహ నృత్యకారుల కోలలతో కలుపుతూ చేసే నృత్యమే దాండియా. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా దాండియా నృత్యాలు చేయడం వారి సంప్రదాయం. గుజరాత్‌లో ప్రాచుర్యంలో ఉన్న దాండియా.. కరీంనగర్‌లోనూ ప్రాచుర్యం పొందింది. దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి ఆలయంలో దాండియా నృత్యాలపై కథనం.





మహాశక్తి ఆలయంలో దాండియా ఆడుతున్న యువతులు, మహిళలు

ఉత్సాహాన్నిస్తుంది



దుర్గామాత వద్ద దాండియా ఆడడం ఉత్సాహాన్నిస్తుంది. దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత రోజూ రాత్రి పన్నెండు గంటల వరకు ఆడుతున్నాం. భక్తి శ్రద్ధలతో దేవిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయి.

– అనురాధ

ఆనందంగా ఉంటుంది



దాండియా నృత్యం చేయడం ఆనందంగా ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం కోసం పూజలు చేసి దాండియా ఆడుతాం. నిర్మలమైన మనసుస్సుతో అమ్మవారిని నాట్యంతో కొలుస్తాం.

– రక్షిత

నాట్యంతో కొలుస్తాం



మేము రాజస్తాన్ నుంచి వచ్చాం, ఏటా దుర్గామాత పూజల్లో భాగంగా దాండియా ఆడటం మా సంప్రదాయం. నాట్యం రూపంలో అమ్మవారిని కొలుస్తాం. అమ్మవారి దయ మాపై ఉంటుంది.

– నీలం ముందాడా

అమ్మ అనుగ్రహం కోసం



నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో దాండియా ఆడుతాం. అమ్మవారి సన్నిధిలో నృత్యం చేస్తూ అమ్మవారి అనుగ్రహం కోసం వేడుకుంటాం. నవరాత్రులు దైవ సన్నిధిలో సంతోషంగా గడుపుతాం. మానసిక ప్రశాంతత ఉంటుంది.

– సంక్షిత, కరీంనగర్

మంచి వ్యాయామం



నవరాత్రి ఉత్సవాల్లో దాండియా నృత్యం చేయడం వల్ల శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది. మనుస్సుకు ప్రశాంతత చేకూరుతుంది. ఏటా తొమ్మిది రోజుల పాటు దాండియా ఆడుతాం.

– కృష్ణ, కరీంనగర్

దేవిని కీర్తించడానికే..



దేవిని కీర్తించడానికే దాండియా ఆడుతాం. దీనివల్ల వ్యాయామం చేసినట్లు అవుతుంది. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారి సేవలో పాల్గొంటాం.

– సరళ ముందడా, రాజస్థానీ మర్వాడీ మహిళా సమాజ్ బాధ్యురాలు

దుర్గాదేవి పూజల్లో తప్పనిసరి



దుర్గాదేవి పూజల్లో తప్పనిసరిగా దాండియా ఆడుతారు. దేవికి నివేదనగా నృత్యం చేయడం ఆనవాయితీ. దాండియా కోలలు దుర్గాదేవి ఖడ్గానికి సూచనగా నిలుస్తాయి. నవరాత్రులు దుర్గాదేవిని ఆరాధిస్తూ అందరితో కలిసి దాండియా ఆడటం ఆనందంగా ఉంటుంది.

– సునంద ముందడా, జ్యోతినగర్, కరీంనగర్

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో..



రోజూ ఒక గంట అయిన దాండియా ఆడితే ఆరోగ్య సమస్యలు ఏవి దరిచేరవు. కానీ అంత సమయం లేదు. పండుగలప్పుడు దేవీనవరాత్రులు, ఫంక్షన్‌లలో, మర్వాడీ సమాజ్ నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో దాండియా ఉంటుంది.

– శశీ సర్‌దా, బ్యాంక్ కాలనీ, కరీంనగర్

స్నేహితులతో కలిసి నేర్చుకున్న



స్నేహితులతో కలిసి దాండియా ఆడటం నేర్చుకున్న. పండుగ వాతావరణంలో దాండియా ఆడటం సంతోషంగా ఉంటుంది. దేవి నవరాత్రుల్లో మహాశక్తి ఆలయంలో అందరితో కలిసి దాండియా ఆడుతా.

– పెద్ది హారిక, గోకుల్‌నగర్, కరీంనగర్

కల్వర్టుకు మరమ్మతు చేయరూ!



కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ శివారు లోలెవెల్ కల్వర్టు భారీ వర్షాలకు ధ్వంసమైంది. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వానలకు పోచమ్మ ఒర్రెపై నిర్మించిన కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండటంతో స్థానికులు ఇటుక ముక్కలతో గుంతలను పూడ్చారు. కల్వర్టు తాత్కాలిక మరమ్మతుకు రూ.5 లక్షలు, హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ, నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మానకొండూర్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సుడా చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్‌లోని సుడా క్యాంపు కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని, రసమయి బాలకిషన్ గెలుపుకోసం నవంబర్ 30 వరకూ పోరాడాలని కోరారు. మూడోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ ఉండింటి సులోచనశ్యాంసన్, పిట్టల కవితమధు, ఉప సర్పంచ్ నెల్లి మురళీ, గడ్డం సంపత్, బోడ రాజశేఖర్, కొత్తకొండ నాగయ్య, అవినాశ్, పుష్పలత, అనిత, నెల్లి శంకర్, గుర్రం కిరణ్, గొల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో వినోద్‌కుమార్ సతీమణి మాధవి, మేయర్ సునీల్‌రావు సతీమణి అపర్ణ

కరీంనగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం పద్మనాయక వెలమ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సతీమణి అపర్ణతో కలిసి హాజరయ్యారు. వెలమ సంఘం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు.

నారాయణ జూనియర్ కళాశాలలో..

నారాయణ జూనియర్ కళాశాలలో కరీంనగర్ బ్రాంచిలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి ఏజీ ఎం ఎస్.తిరుపతి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకురాలు గందె కల్పన విద్యార్థినులు, మహిళా అధ్యాపకులతో కలిసి బతుకమ్మ పేర్చి, ఆడిపాడారు. పూలనే దేవుడిగా కొలిచే గొప్ప సంస్కృతి మన తెలుగువారిదన్నారు. బతుకమ్మ పండుగను విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కళాశాల బ్రాంచి ఏజీఎం సుద్దాల తిరుపతి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగులు



బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా జరిపారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో డి.శ్రీనివాస్, ఏపీవో స్పందన, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, లచ్చయ్య, సుష్మిత, విజయలక్ష్మి, అభినవ్, శ్రవణ్‌కుమార్, అఖిల్, నరేశ్, ఎంపీడీవో ఆఫీస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొట్టు పెడుతూ.. ఓటు అడుగుతూ

- కొత్తపల్లిలో మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యుల ప్రచారం

కొత్తపల్లి: బొట్టు పెడుతూ.. ఓటు అడుగుతూ.. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు గురువారం కొత్తపల్లి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి సతీమణి రజిత 7, 8, 11, 12వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి, మహిళలకు బొట్టు పెట్టి, ఓటు అభ్యర్థించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన గంగుల కమలాకర్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గంగుల సుధాకర్, శారద, రుద్ర రాధ, కౌన్సిలర్లు వాసాల రమేశ్, గండు రాంబాబు, వేముల కవిత, గున్నాల విజయ, ఎస్కే.నజియాబాబా, ఎం.వేణుగోపాల్, కో–ఆప్షన్ సభ్యులు కట్ల మమత, షహనాజ్, ఫక్రుద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు జమీలొద్దీన్, జేరిపోతుల శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బొట్టుపెట్టి, ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి గంగుల సతీమణి రజిత

'బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం'

తిమ్మాపూర్(మానకొండూర్): బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పోరండ్ల మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు కోమటిరెడ్డి కిష్టారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ రెడ్డి అంజిరెడ్డి, గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..

నేడు పలు గ్రామాల్లో 'సద్దులు'

- బొమ్మకల్, గుంటూరుపల్లి, ఆసిఫ్‌నగర్, కాజీపేట గ్రామాల్లో నిర్వహణ
- గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్‌లో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో 9 రోజులకు జరిగితే ఇక్కడ మాత్రం వేములవాడ తరహాలో ఏడు రోజుల్లోనే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో బొమ్మకల్ ఆడపడుచులకు ఇటు పుట్టిన ఊరు, అటు మెట్టిన ఊరిలో జరిగే వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కింది. గతంలో మిగతా గ్రామాల మాదిరిగానే 9 రోజులకు బతుకమ్మ ఆడేందుకు మహిళలందరూ వెళ్లడంతో గ్రామంలో దొంగలు పడి, దోచుకెళ్లారు. అప్పటినుంచి ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ జరుపుకుంటున్నట్లు వృద్ధులు తెలిపారు. బొమ్మకల్‌తోపాటు అనుబంధ గుంటూరుపల్లిలో మహిళలు బతుకమ్మ ఆడనున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాల్లో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. గురువారం బొమ్మకల్ స్టేజీ, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఎదుట బంతిపూలు, పట్టుకుచ్చులను కొందరు వ్యక్తులు ఆటోల్లో తీసుకువచ్చి విక్రయించారు.



చల్మెడ ఆస్పత్రి ఎదుట పట్టుకుచ్చుల విక్రయాలు

ఆడపడుచుల అదృష్టం



రెండు రోజుల వ్యవధిలో పుట్టినింట్లో, మెట్టినింట్లో బతుకమ్మ ఆడే అవకాశం రావడం బొమ్మకల్ ఆడపడుచులు చేసుకున్న అదృష్టం. దొంగల భయంతో గత కొన్ని దశాబ్దాలుగా ఏడు రోజుల్లో సద్దుల బతుకమ్మ జరుపుకుంటున్నాం.

– పురమల్ల లలిత, జెడ్పీటీసీ సభ్యురాలు, కరీంనగర్‌రూరల్

కొత్తపల్లి: మండలంలోని ఆసిఫ్‌నగర్(బావుపేట), ఖాజీపూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నాయి. ఇందుకోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసారు. ఏడు రోజుల సద్దుల బతుకమ్మపై భిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. పురాతన కాలంలో రాజ కుటుంబానికి చెందిన ఆడబిడ్డలు అత్తగారింట్లో ఏడోరోజు సద్దుల బతుకమ్మ జరుపుకొని, తొమ్మిదో రోజు పుట్టిన ఊరిలో జరిగే వేడుకలకు హాజరయ్యేలా నిర్ణయం తీసుకున్నట్లు పెద్దలు చెబుతున్నారు. అదే ఆనవాయితీ నేటికీ ఈ రెండు గ్రామాల్లో కొనసాగుతోందని అంటున్నారు. ఆయా గ్రామాల ప్రజలు బతుకమ్మలు పేర్చేందుకు అవసరమైన తంగేడు, గునుగు, పట్టుకుచ్చులు తదితర పూలను గురువారం సేకరించారు.



బంతిపూల కొనుగోలు..

ఓటరు జాబితాలో మృతులు

కరీంనగర్‌రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏటా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం చేపడుతున్నప్పటికీ జాబితాలో తప్పులు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. పలుచోట్ల డబుల్ ఓటర్లు, మృతుల పేర్లు వెలుగులోకి వస్తుండగా మరికొన్ని చోట్ల అర్హుల పేర్లు గల్లంతవడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తప్పుల్లేకుండా ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో అధికారులు గుర్తించలేకపోయారు. ఈ నెల 4న ప్రకటించిన ఓటరు తుది జాబితాలో పలువురు మృతుల పేర్లుండగా అర్హుల పేర్లు లేకపోవడం వివాదాస్పదమైంది.



జాబితాలో మృతి చెందిన ఓటర్లు (పసుపు రంగులో)

మండలంలో 51,709 మంది ఓటర్లు

కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 3,41,913 మంది ఓటర్లుండగా రూరల్ మండలంలో 51,709 మంది ఉన్నారు. కొత్తగా 17,897 మంది పేర్లు నమోదు చేసుకోగా 4,474 మంది అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే పలు గ్రామాల్లో బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించకపోవడంతో మృతుల పేర్లు, రెండుచోట్ల నమోదైన ఓట్లను గుర్తించలేకపోయారు.

దుర్శేడ్‌లో 120 మంది మృతుల పేర్లు

దుర్శేడ్ గ్రామంలో మొత్తం 3,134 మంది ఓటర్లున్నారు. ఇటీవల ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో 120 మంది మృతుల పేర్లు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం 103 పరిధిలో 53 మంది, 104 కేంద్రంలో 18 మంది, 105 కేంద్రంలో 19 మంది, 106 కేంద్రంలో 30 మంది మృతులున్నారు. అయితే బీఎల్‌వోలు ఇంటింటి సర్వే, మృతుల పేర్లను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. పాత జాబితా ఆధారంగానే నామమాత్రంగా సర్వే పూర్తి చేశారని స్థానిక ప్రజాప్రతినిధులు అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇంటింటి సర్వే ఆధారంగా మృతిచెందినవారిని, రెండు ఓట్లను గుర్తించి, ఓటరు జాబితా నుంచి తొలగించాం. ఏ గ్రామంలోనైనా మృతుల పేర్లు ఉన్నట్లయితే పరిశీలించి, చర్యలు తీసుకుంటాం.

– నవీన్, తహసీల్దార్, కరీంనగర్‌రూరల్

నగరమంతా ట్రాఫిక్ జామ్



ఓవైపు బతుకమ్మ సందడి, మరోవైపు ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ పాదయాత్ర పర్యటనతో నగరమంతా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి, ఎటు వెళ్లాలో తోచక ప్రజలు ఇబ్బంది పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్